


**(గత సంచిక తరువాయి)**

17

**మర్నాడు ఉదయం** కూడా ఆద్య స్విమ్మింగ్‌కి వెళ్ళింది. స్నానం, బ్రేక్‌ఫాస్ట్ తర్వాత చర్చ్‌నించి పాటలు వినపడగానే టి.వి ఆఫ్ చేసి లేచి ఇంటికి తాళం వేసి చర్చ్‌కి వెళ్ళింది. ఆయన సెర్మన్ రెండు నిమిషాల్లో ఆరంభమైంది.

"జీవితాన్ని ఎలా తీసుకుంటున్నావన్న ఎంపిక నీ చేతుల్లో ఉంది. ఓ యువకుడు మొదటి ప్రపంచ యుద్ధంలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేసాడు. అనేకమంది చావులని, బాధలని చూసాడు. యుద్ధానంతరం నవలా రచయితై, బాధాకరమైన చక్కటి కోణాలనించి గొప్ప నవలలని రాసాడు. చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని పేరు ఎర్నెస్ట్ హెమింగ్వే.

"మరొకడు కూడా మొదటి ప్రపంచ యుద్ధంలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేసాడు. ఆ కాలంలో యూరప్‌లో ఫ్లూ జ్వరం ప్రబలింది. దానివల్ల మరణించిన ఎందరినో చూసి, యుద్ధానంతరం కార్టూన్లు గీసి ప్రజల్ని నవ్వించాడు. తను మరణించే సమయానికి కోటానుకోట్ల మందికి వినోదాన్నిచ్చిన అతని పేరు వాల్ట్ డిస్నీ. మనకి ఏం జరుగుతోందో మన చేతుల్లో లేదు. దానికి మనం ఎలా స్పందిస్తామన్నది మాత్రం మన చేతుల్లో ఉంది. జీవితాలన్నీ ఎంపికమయాలు. జీసస్ ఆ ఎంపికని మన ఆధీనంలో ఉంచాడు. అభివృద్ధా? వినాశనమా? జీసస్ తన జీవితంలో జరిగినవాటికి ప్రతికూల నిర్ణయాలని ఎంచుకోక అనుకూల నిర్ణయాలని ఎంపిక చేసుకున్నాడు. మనం అతన్నే అనుసరించాలి. ఓ పెట్టెలో వజ్రాన్ని ఉంచితే అది జువెలరీ బాక్స్ అవుతుంది. అందులో సిగరెట్ పీకని ఉంచితే అది ఏష్ ట్రే అవుతుంది. మనం మనలోకి ఏం ప్రవేశపెడితే అదవుతాం. నిరాశనా? ఆశనా? మీరు మీలో ఏం ప్రవేశపెడుతున్నారు? జీసస్ మిమ్మల్ని కాపాడటానికే రక్తార్పణం చేసాడని నమ్మండి. ఏమీ ఇవ్వలేని మతం మతం కాదు. అదిచ్చేది బాధనే. ఐతే అది సరైన మతం కాదు. ఆనందాన్ని ఇచ్చే మతమే వెలలేనిది. ఆమెన్."

"ఆమెన్." అందరి కంఠాల్లో ఆద్య కంఠం కూడా కలిసింది.

"ఎవరి హోం లైబ్రరీని చూసినా ఆ మనిషి ఎలాంటివాడో అందులోని పుస్తకాలనిబట్టి తెలుస్తుంది. ట్రావెల్ మీద ఆసక్తి గలవారా? వంటమీద అభిరుచి గలవారా? ఇతరుల జీవితాలనించి నేర్చుకోవాలనుకునేవారి బుక్ షెల్ఫ్‌ల్లో

ఆత్మకథలు కనిపిస్తాయి. జీవితాన్ని సరదాగా తీసుకునేవారు రొమాంటికి ఫిక్షన్‌ని, భావకులు కవిత్వాన్ని చదువుతారు. విద్య పూర్తైనా, ఆ విద్యకి చెందిన సబ్జెక్ట్ పుస్తకాలు వారికి ఆ సబ్జెక్ట్ మీద గల ఆసక్తిని  తెలియజేస్తుంది. క్రైం అండ్ మిస్టరీ చదివేవారికి ఊహాశక్తి చాలా ఉంటుంది. ముగింపుని సరిగ్గా ఊహించాలనే పట్టుదలతో వాటిని చదువుతారు. ఇలా ఓ మనిషికి చెందిన ఎన్నిటినో అతను భద్రపరచుకునే పుస్తకాలని బట్టి అంచనా వేయచ్చు. సుడొకో, క్విజ్ పుస్తకాలు మేధావుల లైబ్రరీల్లోనే కనిపిస్తాయి."

అతను చెప్పేది విన్న ఆద్యకి అక్క బుక్ షెల్ఫ్‌లోని పుస్తకాలు గుర్తుకి వచ్చాయి. తన అక్క హైద్రాబాద్‌లో తనకి తెలిసిన అక్క కాదని, బయటి ప్రపంచంలోకి వచ్చాక బాగా ఎదిగిందని మరోసారి అనిపించింది.

"కాని అందరి లైబ్రరీలో ఉండాల్సిన పుస్తకం ఏమిటి? బైబిల్. మీ ఇంట్లో అది లేకపోతే గుమ్మం బయట ఉన్నాయి. మిసెస్ బ్రైట్ గౌరవార్థం ఆవిడ భర్త ఎరిక్ దీన్ని అందిస్తున్నాడు. వెళ్ళేప్పుడు మీరొకటి తీసుకెళ్ళండి. మే హర్ సోల్ రెస్ట్ ఇన్ పీస్."

"ఆమెన్." చాలా కంఠాలు పలికాయి.

"ఏటా బ్రిటీష్ పౌరులకిచ్చే ఏన్యువల్ సర్వీస్ అవార్డ్‌ని క్వీన్ ఎలిజబెత్ ది సెకండ్. ఈ ఏడు వందేళ్ళ మేల్కం క్లాట్‌కి ఇచ్చింది. తన జీవితకాలంలో ఆయనవెయ్యి బైబిల్స్‌ని దానం చేసాడు. ఎవరికి ఏ రోజు వాటిని ఇచ్చాడో రికార్డ్ కూడా మెయిన్‌టైన్ చేసాడు. వారికోసం నిత్యం ప్రార్థనని కూడా చేసేవాడు. ఆయన ప్రేమ న్యూ టెస్ట్‌మెంట్లోని పాల్ రాసిన ఉత్తరాలని నాకు గుర్తు చేసింది. తను ఎవరికోసం ప్రార్థనని చేస్తున్నాడో వారికా సంగతి తెలియచేస్తూ పాల్ ఉత్తరాలు రాసేవాడు. టిమోథీ 1:3, రోమన్స్ 1:9 – 10.. మాల్కంలా మనం ప్రార్థించడానికి వెయ్యిమంది లేకపోయినా ఇక్కడున్న ఒకరికోసం మరొకరం ప్రార్థిద్దాం. మన చర్చ్‌కి కొత్తగా రెండురోజులనించి వస్తున్న మన సోదరికోసం ప్రార్థిద్దాం. ఎందుకో ఆమె తీవ్ర ఆవేదనలో ఉందని నాకు అనిపిస్తోంది. అది ఎంత నిజాయితీతో కూడినదైతే అంత శక్తివంతంగా లార్డ్ జవాబిస్తాడు.." ఆయన ఆద్య వంక చిరునవ్వుతో చూస్తూ చెప్పాడు.

అంతా ఆద్య వంక చూసి తలలు వంచి నిశ్శబ్దంగా ప్రార్థించసాగారు. ఆ క్షణంలో ఆద్యకి లోపలనించి దుఃఖం పొంగుకు వచ్చి విలపించసాగింది. కాని అది హైదరాబాద్‌లో, విమానంలో వచ్చినలాంటి ఏడుపు కాదు. అసలు కారణం తెలీకుండా ఆమె కళ్ళవెంట కన్నీళ్ళు కారాయి. ఎప్పటిలాగా పాస్టర్ ఆఫ్రికాలొని, ప్రపంచంలోని విషాదాలని ప్రస్తవించి ఆ బాధితులకి మంచి జరగాలని ప్రార్థించాక అది ముగిసింది. బయటకి వచ్చాక ఆమె మనసు ఎంతో తేలికపడ్డ భావన కలిగింది.

ఆఫీస్‌నించి వచ్చాక మర్నాడు ట్రిప్ గురించి చైత్ర చెల్లెలితో చెప్పి ఏం బట్టలు వేసుకెళ్ళాలో చర్చించింది.

"నా డ్రస్‌ని ఇద్దామంటే నీకు పట్టవాయె. నువ్వు మంచివి తెచ్చుకోలేదు."

చైత్రే చెల్లెలి డ్రస్‌ని ఎన్నిక చేసింది.

## 18

శనివారం ఉదయం ఆరుకి అక్కచెల్లెళ్ళిద్దరూ లేచారు. ఇరవై నిమిషాల్లో ఉప్మా చేసారు. ఆరుం ముప్పావు కల్లా తయారయ్యారు. ఎన్రికో కోసం ఎదురుచూస్తూ ఇద్దరూ కబుర్లు చెప్పుకున్నారు. తాము వెళ్ళబోయే పర్యాటక ప్రదేశాల గురించి చైత్ర చెప్పింది.

"ఇక్కడనించి కేంప్ కోస్ట్‌కి షుమారు ఏభై కిలోమీటర్లు. గంటన్నరలోపు ప్రయాణం. ముందుగా ఓ క్రొకడైల్ ఫాం చూస్తాం. అక్కడనించి ముప్పై రెండు కిలోమీటర్ల దూరం. లంచ్ చేసి అక్కడే ఉన్న కేంప్ కేజిల్‌ని చూస్తాం. అది చారిత్రాత్మక కోట. స్వీడిష్ వారు దాన్ని కట్టించారు. అది చాలా చేతులు మారి చివరకి బ్రిటీష్ వారి చేతుల్లోకి వెళ్ళింది. దాన్ని చూడటానికి ప్రపంచం నలుమూలలనించీ వస్తారని విన్నాను. మొత్తం నూట డెబ్బై ఐదు కిలోమీటర్ల ప్రయాణం తర్వాత బేక్ టు ది పెవిలియన్. మా కంపెనీవారు కారుని ఉచితంగా ఇచ్చారు. పెట్రోల్ మనమే కొట్టించుకోవాలి. డ్రైవర్‌కి అతని సేవకి రెండువందల ఏభై సిడిలు ఇస్తాను."

ఇద్దరూ బ్రేక్‌ఫాస్ట్ తినకుండా ఎన్రికో కోసం ఆగారు. అతను ఏడున్నరకి వచ్చాడు.

"గుడ్‌మార్నింగ్ గర్ల్స్. వాట్స్ కుకింగ్ ఫర్ బ్రేక్‌ఫాస్ట్?" నవ్వుతూ అడిగాడు.

అతనో స్పూన్ ఉప్మాని తిని చెప్పాడు.

"వావ్! ఇలాంటిది ఎక్కడా తినలేదు. ఎలా చేసారు?"

గోధుమ రవ్వని చూపించి ఎలా చేసారో చెప్పారు. అతను దాన్ని ఆసక్తిగా తెలుసుకోవడం ఆద్యకి ఆశ్చర్యం వేసింది.

"మనం ఇలాంటి మగాళ్ళని ఆడంగి వెధవలంటాం" నవ్వుతూ అక్కతో తెలుగులోగొంతు తగ్గించి చెప్పింది.

"తప్పు. అలా అనకూడదు" చైత్ర చిన్నగా మందలించింది.

అంతా బయటకి వచ్చాక ఐజాక్ చెప్పాడు.

"గుడ్ మార్నింగ్ మేమ్స్. ఐ యాం రెడీ."

"గుడ్ మార్నింగ్ ఐజాక్. వెళ్దాం పద."

చైత్ర అతనికి ఐదు వందల సిడిలు రెండు నోట్లిచ్చిచెప్పింది.

"పెట్రోల్. ఇంకా దారిలో అవసరమైన ఖర్చులకి."

ఎన్రికో ముందు సీట్లో డ్రైవర్ పక్కన, అక్కచెల్లెళ్ళిద్దరూ వెనక సీట్లో చేతి సంచితో కూర్చున్నాక వారి కారు టకరోడీనించి బయలుదేరి పది నిమిషాల్లో ఊర్లోంచి బయటకి వచ్చింది. ఆ తారు రోడ్ వాహనాలు ఎదురుబొదురుగా

ప్రయాణించేంత వెడల్పు మాత్రమే ఉంది. వాహనాల ట్రాఫిక్ పెద్దగా లేదు. దారిలో రోడ్‌కి అటు, ఇటు ఎత్తైన చాలా వృక్షాలు కనిపించాయి. మధ్య మధ్యలో ఇండియాలోలా పల్లెటూళ్ళు ఎక్కువగా కనిపించలేదు.

"ఖాలెద్ ఎప్పుడు వస్తున్నాడో సమాచారం ఏదైనా తెలిసిందా?" చైత్ర అడిగింది.

"తెలీదు" ఎన్రికో జవాబు చెప్పాడు.

ఓ బోర్డ్ మీద 'డోంట్ డ్రైవ్ టైర్డ్' అని ఉంది. దారిలో అటు ఇటు నాలుగు బొంగులు పాతిన ఈతాకుల కప్పుల దుకాణాల్లో పైనాపిల్, పుచ్చకాయ, టొమేటోలు అమ్మేవారు కనిపించారు. వాటిని చూస్తూంటే హైద్రాబాద్‌నించి వరంగల్‌కి వెళ్ళే రోడ్లో వెళ్తున్నానా అని ఆద్యకి అనిపించింది. చైత్ర దారిలో చెప్పింది.

"ఇందాక ఆడంగి వెధవ అంటే తప్పన్నానా? దానికి రెండు జవాబులు. పనికి లింగభేదం లేదు. దాన్ని మనవాళ్ళు అవమానంగా భావిస్తారు. యూరోపియన్ మగాళ్ళంతా అలా ఫీలవకుండా వంట చేస్తారు. అంట్లు తోముతారు. విదేశాల్లోని ఇండియన్ భర్తలు కూడా భార్య ఉద్యోగం చేసేట్లైతే ఆ పనులు చేస్తారు. కాని తమ తల్లితండ్రులు వచ్చినప్పుడు మానేస్తారు. సిగ్గు. ఇక రెండో జవాబు. నేర్చుకోవాలనే తపన మనిషికి అవసరం. అటమిక్ బాంబ్‌ని అభివృద్ధి చేసినవారిలో ఒకడైన ఇసిదోర్ ఐజాక్ రేబికి ఫిజిక్స్‌లో నోబుల్ ప్రైజ్ వచ్చింది. ఎవరో అతన్ని ఎందుకు శాస్త్రజ్ఞుడయ్యావని అడిగితే 'నేను స్కూల్ నించి ఇంటికి రాగానే మా అమ్మ ఇవాళ మీ టీచర్ని మంచి ప్రశ్న అడిగావా?' అని రోజూ అడిగేది. మంచి ప్రశ్నలు వేయడం నేర్చుకోవడంతో నేను శాస్త్రజ్ఞుడ్ని అయ్యాను' అని జవాబు చెప్పాడు. మంచి ప్రశ్న వేసి, నేర్చుకోవాలనే కోరిక ఉంటే మనిషి ఎంత ఎత్తుకైనా ఎదగగలడు."

"నిజమే" ఆద్య ఒప్పుకుంది.

"బై ది వే ఇసిదోర్ ఐజాక్ యూదు మతస్థుడు."

దాదాపు గంట తర్వాత వారి కారు ఎల్మినా అనే చిన్న ఊరి సెంటర్లోని ట్రాఫిక్ లైట్స్ దగ్గర ఆగింది.

"మేడం. కార్న్. ఫ్రెష్ కార్న్" ఓ ఏడేళ్ళ పాప మొక్కజొన్న కండెలతో వచ్చి అడిగింది.

"ఒన్ ప్లీజ్" చైత్ర ఆ పాపకి ఐదు సిడిలని ఇచ్చి కొన్నది.

ఒకతని చేతిలోని పంజరంలోని అందమైన పక్షులని చూసి ఆద్య అక్కతో చెప్పింది.

"హాయిగా అడవిలో స్వేచ్ఛగా తిరిగే వీటిని ఎలా పట్టుకున్నాడో."

"ఎంతిస్తే వాటిని వదిలేస్తావు?" వాడు ఓ కారులోని డ్రైవర్ నించి డబ్బు తీసుకుని ఓ పిట్టని వదిలేయడం చూసిన చైత్ర వెంటనే వాడిని పిలిచి అడిగింది.

"పాతిక సిడీలు."

బేరమాడింది. కారు కదలబోతూంటే దిగి వచ్చాడు. ఆమె పన్నెండు సిడీలు ఇవ్వగానే పంజరం తెరిచాడు. అవన్నీ ఎగిరిపోయాయి. వాళ్ళ దగ్గరకి కార్న్ అమ్మే పిల్ల వచ్చి నవ్వుతూ చెప్పింది.

"వాడు విజిల్ వేయగానే అవన్నీ మళ్ళీ వచ్చి పంజరంలో కూర్చుంటాయి. వాటికా శిక్షణ ఇచ్చాడు."

"ఓ!" అక్కా చెల్లెళ్ళు ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

"పిటో తాగుతారా?" ఐజాగ్ అడిగాడు.

"ఎస్. పిటో" ఎన్రికో వెంటనే ఉత్సాహంగా చెప్పాడు.

"పిటో అంటే స్థానిక బీర్. నైజీరియా, ఘానాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో బీదవారు ఇళ్ళల్లో దీన్ని తయారుచేసి అమ్మడం ద్వారా కొంత సంపాదిస్తారు. సోర్గం, జొన్నలులాంటి తృణధాన్యాలతో వెస్ట్ ఆఫ్రికా దేశాల్లో పిటోని తయారు చేస్తారు. తాజా పిటో బీరైతే ఫెర్మంటేషన్ ప్రాసెస్‌లో వేడిగా ఉంటుంది. లేదా చల్లగా కూడా సర్వ్ చేస్తారు" చైత్ర చెల్లెలికి చెప్పింది.

ఐజాక్ ఓ షాప్‌లోని ఒకర్ని మంచి పిటో ఎక్కడ దొరుకుతుందని అడిగి దాన్ని బ్రూ చేసే ఇంటికి తీసుకెళ్ళాడు.

ఓ ఇంటిముందు వారి ఎస్‌యూవి ఆగింది. వేడిది సర్వ్ చేస్తే ముగ్గురూ తాగారు. దాంతోపాటు స్వల్పంగా చక్కెర, ఉప్పు, మిరియాలతో ఉడకపెట్టిన వేరు శెనగపప్పుని ఇచ్చారు.

"నాకు కొద్దిగా మత్తెక్కింది అక్కా" కారు కదిలిన కాసేపటికి ఆద్య చెప్పింది.

"ఎక్కకపోతే బీర్ తాగడం ఎందుకే పిచ్చిదానా. నాక్కూడా" చైత్ర నవ్వుతూ చెప్పింది.

కేంప్ కోస్ట్‌కి వెళ్ళే దారిలో కొన్ని చోట్ల రోడ్ పక్కన నిలబడ్డ సమీప గ్రామలనించి వచ్చినవారి చేతుల్లో చాలా పెద్ద ఎలుకలు ఉన్నాయి. మరణించిన వాటి తోకలని పట్టుకుని తలకిందులుగా వేలాడదీసి నిలబడ్డారు.

"ఏమిటవి? ఎందుకలా నిలబడ్డారు?" చైత్ర డ్రైవర్ని అడిగింది.

"అవి గ్రౌండ్‌హాగ్స్. అమ్మడానికి. వాటి మాంసాన్ని తింటారు" ఐజాక్ చెప్పాడు.

అక్కాచెల్లెళ్ళు ఇద్దరికి కడుపు దేవినట్లైంది.

మూడు చోట్ల పోలీస్ బేరియర్స్ ఉన్నాయి కాని వీరి బండిని వారు ఆపలేదు. కేమొ కీస్ట్‌కి చేరుకుంటూండగా కుడివైపు సముద్రం, చాలా కొబ్బరి చెట్లు కనిపించాయి.

తొమ్మిది ఏభైకి ఐజాక్ కారుని మొదటి స్టాపైన ఎడమవైపున్న క్రొకడైల్ పార్క్ బయట ఆపాడు. తను దాన్ని ఇదివరకే చూసేసానని చెప్పి అతను రాలేదు. చైత్ర మోకాళ్ళు, మెడ, చేతులు, భుజాల మీద, మస్కిటో రెపెల్లెంట్‌ని స్ప్రే చేసుకుని ఆద్యకి ఇచ్చి చెప్పింది.

"తర్వాత వాళ్ళిద్దరికీ ఇవ్వు."

"మన పక్కనున్న బుర్కినా ఫాసో దేశంలో సగటున నిమిషానికో బిడ్డ మలేరియా వ్యాధితో మరణిస్తున్నాడు. ఆ మలేరియాకి  ఇంకా మందు కనిపెట్టలేదు" ఎన్రికో దాన్ని రాసుకుంటూ చెప్పాడు.

"ఆఫ్రికాలోని ఈ అతి ప్రాణాంతకమైన రోగంతో పోరాడే అతి చిన్న ఆయుధం సబ్బు! మలేరియా అంటుకోవడాన్ని నిరోధించే దాని ధర నలభై రూపాయలు. ఆ సబ్బులో లెమన్ గ్రాస్‌ని, మరికొన్ని దినుసులని తప్పనిసరిగా కలుపుతారు. అది రుద్దుకుని స్నానం చేస్తే ఆ వాసనకి ఆరు గంటలదాకా దోమలు శరీరం మీద వాలవు. 2010లో ప్రపంచవ్యాప్తంగా మలేరియా పది లక్షలమందిని చంపింది. వారిలో ఇండియాలో రెండు లక్షలమంది ఉన్నారు" చైత్ర చెప్పింది.

"అవును. ఓ అమెరికన్ క్రిస్టియన్ ధార్మిక సంస్థ హోటల్స్ గదుల్లో కస్టమర్స్ వాడి వదిలేసిన సబ్బులని సేకరించి, బేక్టీరియా లేకుండా చేసి వాటిని సబ్బులుగా చేసి ఆఫ్రికాలో ఉచితంగా డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు" ఎన్రికో చెప్పాడు.

ఓ యువతి వారిని క్రొకడైల్ ఫాంలోకి ఆహ్వానించింది. ఆన్‌లైన్‌లో తను బుక్ చేసిన టిక్కెట్ల ప్రింటౌట్‌ని చైత్ర చూపించాక వారిని లోపలకి తీసుకెళ్ళింది. లోపలో పెద్ద సరస్సు. మొసళ్ళు కొన్ని ఒడ్డున, కొన్ని నీళ్ళల్లో ఉన్నాయి. వారు చూస్తూండగా మాంసాన్ని నీళ్ళల్లోకి వేయగానే ఒడ్డున ఉన్నవి నీళ్ళల్లోకి వెళ్ళాయి. పావుగంట తర్వాత బయటకి వచ్చారు.

"ఇక్కడికి ఇంకోసారి రానక్కర్లేదు" చైత్ర అసంతృప్తిగా చెప్పింది.

వాళ్ళు తిరిగి వచ్చే సమయానికి ఐజాక్ ఫోన్ మాట్లాడుతున్నాడు.

"హకునా మటట' అని నువ్వు తరచు అంటూంటావు. దానర్ధం ఏమిటి ఐజాక్?" కారు బయలుదేరాక చైత్ర అతన్ని అడిగింది.

ఐజాక్ నవ్వి వివరించాడు.

"హకునా మటట స్వాహిలీ ఎక్స్‌ప్రెషన్. దానర్ధం నో వర్రీస్, నో ట్రబుల్ అని. డోంట్ వర్రీ, బి హేపీ. ఇట్సాల్ గుడ్, నో ప్రాబ్లం అనర్ధం. నో వర్రీస్ ఆస్ట్రేలియన్ ఎక్స్‌ప్రెషన్ కూడా స్వాహిలీలోంచే తీసుకున్నారు."

"కాని స్వాహిలీ ఘనాలో మాట్లాడరు కదా?"

"ఉహూ. ఘనాలో మేము డబ్బై భాషలని మాట్లాడుతాం. ఆ డబ్బైలో పదకొండు భాషల్లో అకన్, గ, దగ్బనీ, యు. ఈ  ఎక్కువమంది మాట్లాడే భాషలు. అకన్ సగం మంది మాట్లాడతారు. దగ్గర్ కూడా ప్రాంతాన్నిబట్టి మాట్లాడుతారు. వాటిలో కొని రేడియో, టి.విల్లో ఉపయోగిస్తారు. డెమొక్రట్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, (డిఆర్సి) టాంజానియా, మొజాంబిక్, కేమరూన్ ఐలాండ్స్, జింబాబ్వే, సౌత్ ఆఫ్రికా ఇంకా ఎన్నో దేశాల్లో స్వాహిలీని మాట్లాడుతరు."

కారు బయలుదేరిన ఐదు నిమిషాలకి కేప్ కోస్ట్ టౌన్‌లోంచి ఎడమవైపు తిరిగి మళ్ళీ ట్రంక్ రోడ్‌మీదకి ఎక్కింది. కకుం నేషనల్ ఫారెస్ట్ కేప్ కోస్ట్‌కి ముప్పై మూడు కిలోమీటర్ల దూరంలో ఉందని ఆద్య మైలురాయిని చూసి తెలుసుకుంది.

"నువ్వు చెప్పింది కరెక్టే అక్కా" దాన్ని చూపించి చెప్పింది.

కొంతదూరం వెళ్ళాక రోడ్‌కి కుడివైపు కొండ గుట్టలని ఇనప సుత్తులతో చిన్న చిన్న గులకరాళ్ళుగా పగలకొట్టే ఆఫ్రికన్ ఆడవాళ్ళు కనిపించారు. వారి పిల్లలు ఓ పక్కన కూర్చుని ఆ రాళ్ళతో ఆడుతున్నారు. కారు రావడం చూసి ఆడవాళ్ళు పనాపి దానివంకే చూడసాగారు.

"ఐజాక్. అక్కడ కారాపు" చైత్ర వెంటనే కోరింది.

ఆపాక 'లంచ్‌కి ఆఫ్రికన్ భోజనం చేద్దాం' అని చెప్పి చైత్ర కారు దిగి వాళ్ళ దగ్గరకి వెళ్ళి లంచ్‌కోసం చేసిన్ బ్రెడ్, ఛీజ్ ఆమ్లెట్ పాకెట్లని ఇచ్చి, పిల్లలకి ఏదైనా కొని పెట్టమని సౌంజ్ఞ చేసి వంద సిడి నోట్‌ని ఇచ్చింది. వాళ్ళ మొహాల్లో కనపడ్డంత ఆనందాన్ని అంతదాకా ఆద్య ఎవరి మొహాల్లో చూడలేదు.

కారు మళ్ళీ బయలుదేరింది. అటు ఇటు దట్టమైన అడవి.

"ఇదంతా ట్రాపికల్ ఫారెస్ట్. ఇక్కడ కుకుం నేషనల్ పార్క్ ఆలోచన ప్రభుత్వానిది కాదు. 1992లో స్థానిక ప్రజల ఆలోచనవల్ల దాని నిర్మించారు" ఐజాక్ చెప్పాడు.

నలభై నిమిషాల తర్వాత కారు కుడివైపు కుకుం నేషనల్ ఫారెస్ట్ అనే బోర్డ్ చూపించే దారిలో మట్టి రోడ్‌లో ముందుకి సాగింది. 'యు ఆర్ నౌ ఎంటరింగ్ కకుం కన్సర్వేషన్ ఏరియా, ఫారెస్ట్రీ కమిషన్, వైల్డ్ లైఫ్ డివిజన్' అనే బోర్డ్ ఉన్న ఆ పార్క్ గేట్ బయట కార్ పార్క్‌లో అది ఆగింది. లోపల ఎడమవైపు వెల్‌కం సెంటర్‌లో ఓ రెస్ట్‌రెంట్, పిక్నిక్ ఏరియా, వైల్డ్ లైఫ్ ఎడ్యుకేషన్ సెంటర్, టికెట్ ఆఫీస్, బాత్‌రూమ్స్, సావనీర్ షాప్‌లు, కుడివైపు ఓ కుటీరంలో హస్తకళావస్తువుల ప్రదర్శన కనిపించాయి. ఎవ్రికో వెళ్ళి విజిటర్ సెంటర్‌లో నలుగురికీ టిక్కెట్స్, బేడ్జెస్ తెచ్చి ఐజాక్ చొక్కా, తన చొక్కాలమీద అతికించుకుని మిగిలిన రెండూ అక్కచెల్లెళ్ళకి ఇచ్చాడు.

"గైడ్ వస్తాడు. వెయిట్ చెయ్యమ్మన్నారు" అతను చెప్పాడు.

'అక్వాబా బేడ్జ్ కంట్రోల్ చెక్ పాయింట్. ప్లీజ్ వెయిట్ ఫర్ యువర్ టూర్ గైడ్' అనే బోర్డ్ దగ్గర మరో మదిమంది నుంచున్నారు. కొద్దిసేపట్లో ముప్పై – ముప్పై అయిదు మధ్య వయసున్న ఓ ఘనా యువకుడు వాళ్ళ దగ్గరకి వచ్చి వారి టిక్కెట్లని తణిఖీ చేసాడు.

"పదండి. నేను మీ గైడ్‌ని. నా పేరు ఇమాన్యుయల్. మొత్తం టూర్ మనకి గంట – గంటన్నర పడుతుంది. అది మీరు ఎంత వేగంగా లేదా ఎంత నెమ్మదిగా నడుస్తారన్న దానిమీద ఆధారపడుతుంది. ఏటా లక్షన్నరమంది దీన్ని దర్శిస్తారు."

అతన్ని అంతా అనుసరించారు. పది రాతి మెట్లెక్కి అతను కాలిబాటమీద ముందుకి సాగాడు. అటు ఇటు నలభై అడుగుల ఎత్తు ఎదిగిన వెదురు గుబ్బుర్లు చాలా ఉన్నాయి. చాలా చెట్ల మొదళ్ళల్లో అవి ఏరకం చెట్లో వివరించే బోర్డ్‌లు

ఉన్నాయి. అవన్నీ వంద అడుగులపైనే ఎదగడంతో ఎండ పడటంలేదు. అతను పది నిమిషాల తర్వాత ఆగి అందరివంకా చూస్తూ చెప్పాడు.

"ఈ అడవి మొత్తం విస్తీర్ణం మూడువందల ఏభై చదరపు కిలోమీటర్లు. ఇక్కడి ప్రధాన ఆకర్షణ కెనొపీ వాక్‌వే. ఆఫ్రికాలో మూడే చోట్ల కెనొపీ వాక్‌వేలు ఉన్నాయి. రెండు వందల అరవై ఆరు రకాల పక్షులు ఈ అడవిలో జీవిస్తున్నాయి. వాటిలోని ఎనిమిది రకాలు ఎండేజర్డ్ స్పీషిస్. ఇక్కడ కనిపించవు కాని లోపలికి వెళ్ళేకొద్దీ అడవి దట్టమై అక్కడ ఏనుగులు కనిపిస్తాయి. మహాగని చెట్టది. కలప అవసరాలకి చుట్టుపక్కల ముప్పైమూడు ఊళ్ళల్లోని వారు దీన్ని వాడతారు. మీకు తెలుసా? శాస్త్రజ్ఞులు ఇంతదాకా రెండువేల రకాల పళ్ళని గుర్తించి వాటికి శాస్త్రీయ నామాలని పెట్టారు. అవి తీగలు, చెట్లు, పొదలనించి వస్తాయి."

మరో పావుగంటలో వారు పైకి ఎక్కి కెనోపీ దగ్గరకి చేరుకున్నారు. అది చెట్లకి కట్టి లోయమీద వేలాడే తాళ్ళతో నిర్మించిన పెద్ద బ్రిడ్జ్. దానిమీద నడకకి కేవలం అడుగు వెడల్పుగల చెక్కలు మాత్రమే పరిచి ఉన్నాయి. అటు, ఇటు ఐదడుగుల ఎత్తున తాడుని అల్లి గోడని నిర్మించారు. రెండువైపులనించి చిన్న వంతెనలమీద ఆ ప్రధాన వంతెనమీదికి ప్రవేశించచ్చు.

"ఈ కెనోపీ పొడవు పదకొండు వందల ఏభై అడుగులు. దీన్ని కేవలం ఏడు చెట్ల పైభాగానికి కట్టి నిర్మించారు. మీరు దీనిమీద వెళ్ళిరావడానికి ఇరవై నిమిషాల సమయం ఇస్తున్నాను. ఇప్పుడు టైం సరిగ్గా పదీ ఏభై ఐదైంది. పదకొండుంపావుకి అంతా ఇక్కడికే రండి. ఎంజాయ్ యువర్ వాక్ ఆన్ ది ఓన్లీ కెనోపీ ఇన్ ఘానా."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in

Post your comments